# మానవత్వం మరణించింది

**- ఇలపావులూరి మురళీమోహనరావు**

## హైదరాబాద్ నుండి శ్రీశైలం వెళ్తున్న సూపర్ డీలక్స్ బస్ అచ్చంపేట చేరేసరికి రాత్రి ఒంటిగంట అయింది. అక్కడ డ్రైవర్ మారతాడు.

వాతావరణం చల్లగా వుంది. వెన్నెల వర్షంలా కురుస్తూ చలిని మరింత పెంచుతున్నది.

ఓ అరగంట టైముందని సిగరెట్ తాగుదామని బస్ దిగాడు శ్రీహర్ష. శ్రీశైలం ప్రయాణం అతని జీవితంలో ఇదే మొదటిసారి. సహజంగా అతనికి శివభక్తి మెండు. అందుకే పెళ్లి కాగానే ముందు శ్రీశైలం వెళ్లి అక్కడినుండి తిరుపతి, మద్రాస్ తమిళనాడులోని ఇతర ప్రాంతాలు చూడాలని నెలరోజుల ప్లాన్ వేశాడు.

శరీరాన్ని జివ్వుమనిపిస్తున్న ఆ చలిలో సిగరెట్ పొగను గుండెల నిండా పీలుస్తూ అనిర్వచనీయమైన అనుభూతిని పొందుతున్నాడు శ్రీహర్ష.

బస్ హారన్ మోగింది. చివరి దమ్మును ఆప్యాయంగా పీల్చి పరుగు పరుగున వెళ్లి తన సీట్లో కూర్చున్నాడు.

''అబ్బ...సిగరెట్ కంపు'' ముక్కు మూసుకుంటూ అంది సౌమ్య.

భార్య చెక్కిలిమీద చిటికవేసి నవ్వాడు శ్రీహర్ష.

''పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్ అన్నాడోయ్ ఆరుద్ర'' అన్నాడు చిలిపిగా.

''ఆరుద్ర కాదు గురజాడ'' అన్నది సౌమ్య.

''ఎవరో ఒకరు. మొత్తానికి అన్నారుకదా!''

''ఆ కంపు నాకు పడదు. మానుకోకూడదూ?''

''పెళ్లయిన తరువాత ప్రతి ఆడదీ మొట్టమొదటిసారి మొగుడిని కోరే కోరిక ఇదే. ప్రతి మగాడూ ఈ కోరిక మన్నిస్తే సిగరెట్లు తయారు చేసే కంపెనీలన్నీ ఏం కావాలి? ఎంతమందికి ఉద్యోగాలు పోతాయ్? ఎన్ని కుటుంబాలు వీధిన పడతాయ్? ఓహ్! ఆ దృశ్యం ఊహించుకుంటేనే భయంకరంగా వుంది'' చెవులు మూసుకుంటూ అన్నాడు శ్రీహర్ష.

అందంగా నవ్వింది సౌమ్య. చల్లని వెన్నెల నేరుగా అద్దంలోంచే సౌమ్య లేత ముఖంమీద పడుతుండడంతో ఆమె దంతాలు వెన్నెల్లో ముత్యాల్లా మెరిశాయి. పరవశుడయ్యాడు శ్రీహర్ష.

''స్టన్నింగ్ బ్యూటీ'' అనుకున్నాడు శ్రీహర్ష మనసులో.

బస్ ఘాట్‌రోడ్‌లోకి ప్రవేశించింది. అక్కడి నుంచి శ్రీశైలానికి దాదాపు తొంభై కిలోమీటర్ల దూరం.

రోడ్డు మెలికలు చాలా ఎక్కువ. ట్రాఫిక్ చాలా తక్కువ.

నల్లటి తారురోడ్డుమీద దట్టమైన అరణ్యాన్ని బస్ హెడ్‌లైట్స్ వెలుగులో చూస్తూ రెండు నిముషాలకో వంపు తిరుగుతూ అటూ ఇటూ ఊగుతుంటే ఎంతో మజాగా వుంటుంది. ఒక్కోచోట మలుపులో కొండను ఢీకొంటుందేమో అనిపిస్తుంటుంది.

బస్‌లో వున్న పదిహేనుమంది ప్రయాణికులు వచ్చీ రాని నిద్రపోతున్నారు. కళ్లు మూతలు పడగానే ఏదో మలుపు వచ్చి ఒరగడం, మళ్లీ మామూలుగా కూర్చోవడం...

ఉన్నట్టుండి సడెన్‌బ్రేక్‌తో కీచుమంటూ ఆగింది బస్సు.

దొంగలెవరైనా ఆపారేమోనని అందరూ ఉలికిపడి లేచారు. అద్దాల్లోంచి చూశారు.

ఎదురుగా హృదయ విదారక దృశ్యం.

రోడ్డుకు పక్కగా ఓ యువకుడు రక్తపు మడుగులో గిలగిలా కొట్టుకుంటున్నాడు. అతని మీద మోటార్‌సైకిల్ పడి వుంది. సహాయం కోసం దీనంగా అరుస్తున్నాడు.

ప్రయాణికుల హృదయాలు ద్రవించాయి.

''మైగాడ్'' అంటూ లేచాడు శ్రీహర్ష.

''పదండి. అతన్ని హాస్పిటల్‌కు తీసుకువెళ్దాం'' అన్నాడు.

మరో ఇద్దరు ముగ్గురు యువకులు కూడా లేచారు.

''సార్...ఆగండి'' అన్నాడు డ్రైవర్.

అందరూ అతనివైపు చూసారు.

''వాడెవడో పీకలదాకా తాగి ఏ రాయికో గుద్ది వుంటాడు. ఇక్కడనుంచి వెనక్కు తిప్పడానికి వీలులేదు. వచ్చినంత దూరం రివర్స్‌లో వెళ్లాలి. ముందుకు వెళ్లాలంటే ఇంకా అరవై కిలోమీటర్లు వెళ్లాలి. అతని రక్తం చాలా పోయింది. సున్నిపెంట వెళ్లేదాకా అతని ప్రాణం వుంటుందని గ్యారంటీలేదు. మన చేతుల్లో ప్రాణం పోయిందంటే మనమే యాక్సిడెంట్ చేశామని పోలీసులు కేసు పెడతారు. చాలా రిస్కవుతుంది. మన దారిన మనం వెళ్దాం'' అన్నాడు డ్రైవర్.

అతనితో మరికొందరు శృతి కలిపారు. దాంతో ముగ్గురు యువకులు వెనక్కు తగ్గారు.

''అలా అని చూస్తూ చూస్తూ వదిలేసి ఎలా వెళ్తాం? మానవత్వం అన్న మాటకు అర్థం ఏముంది? అతను బ్రతకొచ్చేమో? పోలీసుల గురించి భయం ఎందుకు? ఇంతమంది సాక్ష్యం చెబుతాంకదా? దిగండి'' అన్నాడు శ్రీహర్ష.

''బాబూ! నీవు కుర్రాడివి. జీవితంలో మొదటిసారిగా శ్రీశైలం వెళ్తున్నాను. లేనిపోని గొడవల్లో మమ్మల్ని ఇరికించ వద్దు. పోలీసుల సంగతి నీకు తెలియదు'' అన్నదో వృద్ధురాలు.

అందరూ ఆమెతో వంత పాడారు.

శ్రీహర్ష ఏదో అనబోతుండగా సౌమ్య వారించింది.

''హనీమూన్ అని బయలుదేరాం. అనవసర రిస్కు వద్దు. ఎంతోమంది పోతున్నారు. ప్లీజ్...'' అంది.

బస్ బయలుదేరింది. శ్రీహర్ష మనస్సు బరువెక్కింది.

ఆ దృశ్యాన్ని మర్చిపోయి అందరూ ఆదమరచి నిద్ర పోతున్నారు. శ్రీహర్ష మాత్రం ఆకాశాన్ని చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

ఉన్నట్టుండి బస్ ఒక ఇరుకైన మలుపు తిరిగింది.

అక్కడే ఏదో జరిగింది!

ఉన్నట్టుండి భయంకర శబ్దం! ప్రయాణీకుల గగ్గోలు. ఎక్కడికో... పాతాళానికి వెళ్తున్న అనుభూతి!


ప్రయాణీకులు క్రిందా మీదా పడ్డారు. బస్‌లోనే కొంతమందికి తలలు పగిలాయి. బస్ లోయలో పడిపోయినట్లు అర్థం అయింది అందరికీ.

అంతా అయోమయం. బండలమీద పడ్డవారు కొందరు, చెట్ల కొమ్మల మధ్య చిక్కినవారు కొందరు.

బస్ అద్దాలన్నీ పగిలిపోయాయి. పగిలిన అద్దాలు చీరుకుపోయి కొందరు స్పృహ కోల్పోయారు. అద్దాల్లోంచి బయటకు వచ్చి తూలి క్రింద బండల మీద పడ్డారు కొందరు. మోచేతులు, మోకాళ్లు, నడుములు విరిగి కొందరు.

భయంకరంగా ఏడుస్తున్నారు. సౌమ్య, శ్రీహర్షలు కూర్చున్నవైపు సగం కొట్టిన చెట్టు దూసుకొచ్చి సౌమ్య తల

**ఉన్నట్టుండి భయంకర శబ్దం! ప్రయాణీకుల గగ్గోలు. ఎక్కడికో... పాతాళానికి వెళ్తున్న అనుభూతి! ప్రయాణీకులు క్రిందా మీదా పడ్డారు. బస్‌లోనే కొంతమందికి తలలు పగిలాయి. బస్ లోయలో పడిపోయినట్లు అర్థం అయింది అందరికీ.**



చిట్లిపోగా శ్రీహర్ష కంఠం సగం తెగింది. ప్రాణం మాత్రం పోలేదు. ఆర్తనాదాలు మిన్నుముట్టాయి. ఎవరైనా వస్తారేమోనని అరుస్తున్నారు అందరు.

గంట గడిచింది. ఒక్క వాహనమూ రాలేదు. అరిచే ఓపికలేక మూలుగుతున్నారు. కానీ ఆ మూలుగు గొంతు దాటి రావడంలేదు.

శ్రీహర్ష నోరు తెరిచి పైకి చూస్తున్నాడు. దాహంతో గొంతు ఎండిపోయింది.

దూరంగా ఏదో కారు చప్పుడు. ప్రాణాలమీద ఆశ కలిగింది. శక్తినంతా కూడదీసుకుని ''హెల్ప్'' అని అరిచాడు.

కారు ఆగిన శబ్దం. శ్రీహర్షలో ఆశ పుంజుకుంది.

మీద టార్చ్ వెలుగు పడింది. కళ్లు బలవంతంగా తెరిచి చూసాడు.

''హెల్ప్ ప్లీజ్...'' అరిచాడు.

''మైగాడ్... యాక్సిడెంటయింది. సునీతా! డిక్కీలో తాడు అందుకో. అతనెవరో కదులుతున్నాడు. త్వరగా సున్నిపెంట తీస్కెళ్దాం. పది నిముషాల్లో వెళ్లొచ్చు. కమాన్ క్విక్...'' అరిచిందో మగ కంఠం.

''భాస్కర్! డోన్ట్ బి సిల్లీ. మన చేతుల్లో అతని ప్రాణం పోయిందంటే అతన్ని మనమే చంపి తప్పించుకోవడానికి నాటకమాడామని పోలీసులు మనమీద కేసు పెడతారు. అనవసరమైన రిస్క్. కమాన్ లెటజ్ గో'' అన్నదో ఆడ కంఠం.

టార్చి వెలుగు ఆరిపోయింది. కారు కదిలిన శబ్దం! ఆ మాటలు విన్న శ్రీహర్ష కళ్లు మూతలు పడ్డాయి.

★